# గాయం

గాయాలు తీయని స్మృతుల్ని రగిలిస్తాయి. గాయాలు తీరని శాపాలై కాటేస్తాయి. కొన్ని గాయాలు జీవితంలో దీపాల్ని వెలిగిస్తాయి. పూయిస్తాయి. కొన్ని గాయాలు జీవితాన్ని అగాధంలోకి, అంధకారంలోకి విసిరేస్తాయి. అన్ని గాయాలు అందంగా వుండవు. కొన్ని గాయాలు అందవిహీనంగా వుంటాయి. అంతర్లోకాల్ని దగ్ధం చేస్తాయి.

నన్ను నేను ఎక్కడ తడుముకున్నా గాయాలే పలకరిస్తాయి. నా జీవితమే ఒక గాయాల సంపుటిలా వుంది. నేనే నిలువెత్తు గాయంలా వున్నాను.

నా మోచేతి మీది కాలినగాయాన్ని స్పృశించినప్పుడల్లా నా కళ్ల ముందు అమ్మ కదలాడుతుంది. ఆమె ప్రేమామృతహస్తాలు నన్ను పెనవేసుకుంటాయి.

నా మోచేతి మీది గాయం ఒక కథలాగా ఒక కలలాగా గడిచిపోయిన నా బాల్యాన్ని గుర్తుచేస్తుంది.

నన్ను చేతుల్లోకి తీసుకొని ముద్దు చేస్తున్నప్పుడో, నాకు జాబిల్లిని

చూపిస్తూ గోరుముద్దలు తినిపిస్తున్నప్పుడో అమ్మ నా మోచేతి మీది గాయాన్ని కదలించేది. గతాన్ని తల్చుకొని బాధతోనూ, ప్రేమతోనూ కరిగిపోయేది.

"నువ్వప్పుడు బాగా చిన్నపిల్లవి. ఇంకా నడకలు నేర్వని చంటిదానివి. సంక్రాంతి పండుగతో నేను హడావుడిపడుతున్నాను. నిన్ను నిద్రపుచ్చిన తర్వాత వంటగదిలో గారెలు చేస్తూ నా ధ్యాసలో నేనున్నాను. ఎప్పుడు నిద్రలేచావో ఏమో! నువ్వు సడీచప్పుడూ లేకుండా పాక్కుంటూ వంటగదిలోకి వచ్చేశావు. నా ఎదురుగా మరుగుతున్న నూనెమూకుడూ, భగభగలాడే కట్టెలపొయ్యి వున్నాయి. నిన్ను చూడగానే నాకు కంగారెత్తి పోయింది. పొయ్యి దగ్గరికి నువ్వు పాకుతూ వచ్చేస్తే ఏం జరుగుతుందోనన్న ఆతృతతో ఒక్క పరుగున వచ్చి నిన్ను అందుకోబోయాను. ఆ కంగారులో నా చేతిలో వున్న మండుతున్న అట్లకాడ గురించి మర్చిపోయాను. అది తగిలి నీ చెయ్యి కాలిపోయింది. అది తగలగానే కెవ్వుమని ఎంతలా గుక్కపెట్టావనుకున్నావ్?! నీ ఏడుపు చూసి నేనెంతో విలవిలలాడిపోయాను. ఏం చెయ్యాలో తెలియలేదు. బోరున ఏడ్చాను. పక్కవాళ్ళంతా పరుగు పరుగున వచ్చారు. మనిద్దరి ఏడుపులూ చూసీ గాయమయింది నీకోనాకో తెలియక తికమకపడ్డారనుకో" నా గాయాన్ని మృదువుగా తడుముతూ అమ్మ చెప్పే ఈ సంఘటనని ఎన్నెన్నోసార్లు స్కూల్లో స్నేహితులకి ఎంతో ఇష్టంగా చెప్పుకునే దాన్ని.

◆◆◆

గాయాలకి ముళ్ళుంటాయి. ఆ ముళ్ళు మనుసుని చిల్లులు పొడుస్తాయి. గుండెల్లోకి శూలాలు విసురుతాయి. నా మోకాలు మీది గాయం ముల్లులాగే దిగబడింది. చెరిగిపోని మచ్చలా ఇప్పటికీ సలుపు తోంది. పగిలిపోయిన నా బాల్యాన్ని గుర్తుకుతెస్తోంది.

నేనప్పుడు నాలుగో తరగతి చదువుతున్నాను. చిరుతిళ్ళతో తిరునాళ్ళలా గడిచేవారోజులు. చేతిలో అమ్మపెట్టే చిల్లరపైసలన్నీ స్వేచ్ఛగా ఖర్చుచేసేదాన్ని. పీచు మిఠాయిని చూస్తే ఎగబడికొనుక్కునే దాన్ని. ఓ రోజు నా దగ్గర చిల్లరంతా కొండెక్కింది. సరిగ్గా ఆ పూటే పీచు మిఠాయిబండి స్కూలు ముందు ప్రత్యక్షమయ్యింది. ఆ ఎర్రని మాధుర్యాన్ని చూడగానే

నా గొంతు నిలువునా తడిసిపోయింది. ఏం చేయాలో తోచక దిగాలు పడ్డాను. ఇంతలో రెండు జడల పచ్చరిబ్బనుపిల్ల అడగనే అడిగింది! 'పీచు మిఠాయి కొనిపెట్టవే' అని, 'డబ్బుల్లే'వన్నాను. ఆ పిల్ల నా వొంక చిత్రంగా చూసింది. 'నీ దగ్గర డబ్బుల్లేవా. లేకపోయినా ఫర్వాలేదే. నీకని చెప్తే అరువిస్తాడే' అని నా చెయ్యి పట్టుకొని పరుగుతీసింది.

అరువేకదా అని అందివచ్చినన్నీ మొహం మొత్తేదాక తిన్నాం. అరువైతే తిన్నాం కానీ బాకీ సంగతి పట్టించుకోలేదు. వేసవి సెలవుల దాకా అప్పుని పెంచిపోషించానే కానీ తీర్చిన పాపాన పోలేదు.

వేసవి సెలవులు రానే వొచ్చాయి. లాస్ట్‌వర్కింగ్‌డే రోజున పీచు మిఠాయిబండిని తెలిగ్గానే తప్పించుకోగలిగాను. ఇల్లు చేరేదాకా నాలో దుడుకు తగ్గనే లేదు. అయితే అందుకు తగ్గ మూల్యాన్ని చెల్లించక తప్పలేదు.

ఆ రోజు నేను నాన్న వెంట రిక్షాలో మార్కెట్‌కి వెళ్తున్నాను. ఎప్పుడు చూశాడో, ఎలా వచ్చాడో తెలీదు కానీ పీచుమిఠాయి అమ్మే అబ్బాయి రిక్షాకి అడ్డంపడ్డాడు. 'బాకీ' గురించి నలుగురి ముందు నన్ను నిలదీసి గొడవచేసేడు.

నాన్నకి పరిస్థితంతా అర్థమయ్యింది. ఆయన ముఖం క్షణాలలో రౌద్రంగా మారిపోయింది. కళ్ళలోంచి సెగలు చిమ్మాయి. పీచుమిఠాయి బండివాడికి చిల్లరడబ్బులు ఇచ్చి పంపించేశాడు.

ఆ అబ్బాయి అటు తిరగ్గానే నా చెంప చెళ్లుమనిపించాడు. ఊహించని ఆ దెబ్బకి సీట్లో వున్నదాన్నల్లా విసురుగా ముందుకి తూలిపడ్డాను. నా మోకాలు చిట్లిపోయింది. నా చిన్నతనం చెదిరిపోయింది.

◆◆◆

గాయాల కథలు ఒక్క శరీరానికే కాదు కదా. పైకి చిన్నదిగా అసలు లెక్కలోకే రాని సన్నని సూది శరీరాన్ని పెద్దగా గాయపర్చలేదు. కాని మెత్తని గుండెలోకి అలవోకగా దిగబడదూ? ఆ గాయం కనిపించదు. కంపింపచేస్తుంది.

కొత్త సంవత్సరం! అన్నయ్యలిద్దరూ గ్రీటింగ్‌కార్డ్స్ మీద పేర్లు,

చిరునామాలు రాస్తున్నారు. శుభాకాంక్షలను పంపించాల్సిన దగ్గర వ్యక్తులు నాకుంటారని ఇంట్లో ఎవ్వరికీ తోచలేదు.

వాళ్ళు కొనిచ్చే బట్టలు, నగలు, పెట్టే తిండే తప్పా నా అంతట నేను ఏ రోజు నాకు అదీ ఇదీ కావాలని అడగలేదు.

'నీకేమైనా కావాలాని' నన్నెవరూ ఎప్పుడూ అడగలేదు. చదువుకునే నాకు డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి?

పాకెట్‌మనీ...పాకెట్స్ కచ్చితంగా అబ్బాయిలకేనా వుంటాయి. అమ్మాయిలకి జేబులేవి?

జేబులు లేవు కదా....మనీ కూడా అక్కర్లేదనుకున్నారనుకుంటా, అన్నయ్యలకి ఇచ్చినట్టు నాకు పాకెట్ మనీ ఇచ్చేవారుకాదు.

చదువుకున్న అమ్మాయిలని పెళ్ళి చేసుకోవాలని అబ్బాయిలు సరదాపడు తున్నారని ఇంట్లో నన్ను చదివించేవారు తప్పా నాకేం చదువుకోవాలని వుందోనని ఎప్పుడూ ఆలోచించలేదు. నన్నడగలేదు. సైన్స్ గ్రూప్ అయితే డబ్బులు ఎక్కువవుతాయని, కామర్స్ అయితే ట్యూషన్స్ అవసరం వుంటుందని ఆ గ్రూపూ వద్దని, ఆర్ట్స్ గ్రూప్‌లో జాయిన్ చేశారు.

చదువుకోవటం - నాకే చదువు ఇష్టం? ఆక్సీజన్ ఎలా తయారు చేయడం -మందార....హైబిస్కస్ ఫ్యామిలీయేనా.....ఇవన్నీ నాకిష్టమా.....

ఎకనమిక్స్, సివిక్స్, పొలిటికల్ సైన్స్....ఇవి నే చదువుకోవాలనుకున్నానా? ఇవన్నీ ఫిజిక్స్‌ని-బాటనీని నేర్పిస్తాయి. డిగ్రీలు చేతికొస్తాయి. దేశదేశాల ఆర్థిక రాజకీయ వ్యవస్థని వివరిస్తాయి తప్పా - ఇల్లు - మనుషులు - లాభాల బంధాలు - నష్టాల సంబంధాలు వీటిని చెపుతాయా?.... చెపితే ఈ గాయాలుంటాయా!

మేనత్త కొడుకు- బావ నా మొగుడని నే పుట్టగానే అందరూ అన్నారంట. అమ్మ అత్తా సంబర పడ్డారంట. ఆ భావ, అత్త, మావయ్య బొంబాయిలో వుంటారు. వాళ్ళు ఆంధ్ర వస్తున్నారని కబురు రాగానే నాన్న మా పెళ్ళి విషయం మాట్లాడాలనుకున్నారు. వాళ్ళు వచ్చారు. వస్తూనే హడావిడిగా ఈ పక్కవూరు ఆ పక్కవూరు - వూరిమీద వూరు తిరిగేస్తున్నారు. వాళ్ళు ఎక్కడికి ఎందుకు వెళుతున్నారో అంతా గోప్యమే.

ఆ సాయంత్రం అమ్మా, అత్తయ్యా, చెల్లి గుడికి వెళ్ళారు. నాన్న, మావయ్యా వూర్లో తెలిసినవాళ్ళింటికి వెళ్ళారు. అన్నయ్యలెప్పుడూ మా వూరి మహారాజులే.

అమ్మ అప్పచెప్పి వెళ్ళిన వంటపని చేస్తుంటే బయటికి వెళ్ళిన బావ తిరిగొచ్చాడు. కాఫీ కావాలన్నాడు. కాఫీ కప్పు అందించాను. గదిలోంచి బయటకి వస్తుంటే మంచినీళ్ళు కావాలన్నాడు. మంచినీళ్ళ గ్లాసు అందిస్తూంటే - గ్లాసుతో పాటు చేతిని అదిమి పట్టుకున్నాడు. అతని వైపు అయోమయంతో చూశాను. అవి మామూలు చూపులు కావు.

అతని చేయి బలంగా నా చేతి చుట్టూ బిగుసుకుంటోంది. చూపుల్లో రేగుతున్న కోరిక. చేయి వెనక్కి బలంగా లాక్కుంటుంటే బెదిరిన సవ్వడి. గాజుల సవ్వడి. సప్త వర్ణాల సన్నటి మట్టిగాజులు. నా రేయింబవళ్ళలో ప్రతి కదలికకీ గలగల స్పందించే గాజులు. నా ముంజేతుల మీద ఊయలలూగుతూ బోలెడు కబుర్లు చెప్పే ప్రియమయిన గాజులు.

కట్టుకునే చూపుగానో - చుట్టపు చూపుగానో వచ్చిన మేనత్త కొడుకు. అతని బలవంతపు కావలింతలో నా పెనుగులాటకు పగిలిన చిన్నారి గాజులు. నెత్తురు చిమ్మిన లోతైన గాటు. కొన్నాళ్ళకి దేహం మీద మానిన గాయం. ఈనాటికీ చెరగని మాలిన్యముద్ర.

◆◆◆

పారాణి పాదాలతో గోరింట పండిన చేతులతో ఆర్భాటంగా సంబరాల సౌగంధంతో గాయాల పట్టికలోకి సునాయాసంగా వచ్చేసే మరో గాయం వివాహం.

అత్తయ్య వాళ్ళు వెళ్ళిపోయారు. బావ బాంబే అమ్మాయిల్లాంటి మోడ్రన్‌గర్ల్ భార్యగా కావాలనివుందని ఇక్కడికి వచ్చే ముందు అడిగాడంట. అలాంటి అమ్మాయి కోసం ఇక్కడికొచ్చి సంబంధాలు వెతికేరంట. వాళ్ళలో ఎవరో ఒక అమ్మాయితో త్వరలో బావ పెళ్ళంట. 'కట్నం డబ్బులు ఎక్కువొస్తాయని రక్తసంబంధాన్ని కాదని వేరే సంబంధానికి పోయాడు మా బావని' నాన్న వాపోయారు.

బావ పెళ్ళిలేఖ వచ్చింది. బావతో పెళ్ళి గోల తప్పినందుకు తేలిగ్గా

వూపిరి పీల్చుకున్నాను.

అలా ఎన్నాళ్ళో పీల్చుకోలేకపోయాను.

తలస్నానం, పట్టుచీర, అమ్మ నెక్లెస్.... అరే బాబోయ్‌ః. ఇవి నా అందాన్ని పెంచుతున్నాయో లేదో ... ఇంటివాళ్ళ తాహతుని ప్రదర్శిస్తున్నాయో లేదో గానీ అద్దం లేకుండా ముస్తాబైపోవటం అలవాటైపోయింది.

అమ్మాయిని చూపించండి.

నమస్కారాలు.

తలెత్తాలా? కనురెప్పలు విప్పాలా? అంతా అయోమయం. అసలు నా చూపెంత నిరుపయోగమో కదా ఈ సన్నివేశంలో.

వెళ్ళి రాస్తాం.

వాళ్ళు రాసేవాళ్ళు.

అమ్మాయి నచ్చింది. జాతకాలు సరిపోయాయి. మిగిలిన విషయాలు మాట్లాడు కుంటే ముహూర్తాలు పెట్టుకుందాం.

ఆ మిగిలిన విషయాలు ఎప్పుడూ మిగులుగానే వుండిపోతూనే వున్నాయి. సంబంధాలు... చూపులు... ఒకటి... రెండు.... మూడు.... పది.... ఇరవై.... లెక్కలు మర్చిపోయాను.

చివరికి లక్ష రూపాయల కట్నంతో సంబంధం ఖాయమయి పోయింది. పెళ్ళంటే భూదేవంత పీట..... ఆకాశమంత పందిరి.....సన్నాయి పాటలు....కొబ్బరాకుల గలగలలూ..... మామిడాకుల పరిమళం.....బంగారు తలంబ్రాలు.... నాగవల్లి.... పూల్జడ... వుహూ ఇవికావ్......పెళ్ళంటే వియ్యాలవారికి సరిగ్గా జరగని మర్యాదలలిస్ట్..... కాళ్ళు కడిగే వెండిపళ్ళెం, చెంబు ఇంత చిన్నవా.....ఆడపడుచు లాంఛనాలు ఇంకాస్త పెంచండి... తగాదా....ఘర్షణ......గొడవ....వాట్‌నాట్.....పెళ్ళంటే.

అతనింటికి వెళ్ళాను.

చాకిరీ....ఎత్తిపొడుపులు దెప్పుళ్ళతో ముప్ఫై రేయింబవళ్ళు గడిచాయి.

పట్నంలో బండుంటే బాగుంటుందని మీ అల్లుడు అన్నాడంటూ నాన్న దగ్గరికి సిగ్గుపడుతూ ప్రయాణం. ఒక్క గ్రీటింగ్ కార్డయినా నాకు ఇవ్వాలనే ఆలోచనలేని అన్నయ్య తన స్కూటర్ ఇచ్చాడు.

వి.సి.పి. కావాలంటూ ఇంటికి ప్రయాణం. ఇచ్చారు. ఒకటా ....రెండా...... కోరికలూ...అల్లుడా మజాకానా....అల్లల్లాడిపోతూ అప్పులు చేసిమరీ కోరికలు తీరు స్తున్నారు...పీచుమిఠాయికి దెబ్బలు తిన్న శరీరం.....పాకెట్‌మనీకి నోచుకోని పావడాపరికిణి....అల్లుడనేవాడి కోరికలని అడుగులకి మడుగులొత్తుతూ తీర్చటం చూసి విస్తుపోయింది.

'ఇస్తామన్న కట్నం ఇచ్చాం. ఇస్తామన్న కానుకల కంటే ఎక్కువే ఇచ్చాం. ఇంక ఒక్క పైసా కూడా ఇవ్వలేను. అల్లుడు డబ్బు అనగానే బయలుదేరి ఇంటికి రావొద్దని' ఖరాకండీగా నాన్న చెప్పేశాడు. అమ్మ కళ్ళల్లో నీళ్ళు. మొగుడ్ని చెప్పుచేతల్లో పెట్టుకోలేని దద్దమ్మవన్నారు. నోట్లో నాలికలేదా? ఇంటి పరిస్థితి వివరించలేని వాజమ్మవన్నారు. నోరువిప్పి అతన్ని దార్లో పెట్టుకోమన్నారు. నీ ఏడుపేదో నువ్వు ఏడు. టింగురంగా అంటూ ఇంటికి రావొద్దన్నారు.

ఆ ఇంటి తలుపులు మూసుకుపోయాయి.

సప్తగాయాల పసుపుతాడు మెడలో ముడులు వేయించుకున్న నేరానికి జీవితానందం కట్నకానుకల చెరసాలయింది. ఇంటికి వెళ్ళి డబ్బు పట్టుకురమ్మనటం, నేను వెళ్ళననటం నిత్యగీతా పారాయణమయింది.

చేతికి ఏది దొరికితే దాంతో చితక్కొట్టేవాడు. తిట్టేవాడు. శరీరం దెబ్బలకి తమాయించుకుంటోంది. ఎటొచ్చీ మనసే భీకరమయిన అశాంతి అరణ్యమయ్యింది.

పురిటికి ఆ ఇంటికి వెళ్ళాను. మూడు నెలల బిడ్డతో ఈ ఇంటికి.

డబ్బు ఏం పట్రాలేదని కొట్టికొట్టి అతనికే చికాకేసి డబ్బా కిరోసిన్ తలంబ్రాల్లా తలపై గుమ్మరించాడు.

"ఇంటికి పోయి డబ్బుతో రా. లేకపోతే అంటించేస్తా"నన్నాడు.

ఇల్లు!?

ఏ ఇల్లు?!

రావొద్దనే ఆ ఇల్లు!

పొమ్మనే ఈ ఇల్లు!

అగ్గిపుల్ల. చిన్న మంట. గుప్పున వెలిగింది.

మనిషి సమస్తం దగ్ధమయి మసిబొగ్గులా ఒకే ఒక వ్రణమయింది. సగం సగం కాలిపోయిన అవయవాలతో మానవాకారాన్ని కోల్పోయిన నైరూప్య చిత్రమయింది. దేహమంతటా తేలిన బొబ్బలు. చితికిన కొన్ని బొబ్బల నుంచి చిప్పిల్లుతున్న కన్నీళ్ళలా రసి. ఎటుకదిలినా సలపరించే పుండు. ఎటూ మెదలకున్నా నిలవనీని పుండు. ఉండచుట్టుకుపోయిన చీకటిలోంచి రెండు మిణుగురుల్లా మినుకుమనే నేత్రాలు.

అయిదుగంటల అపస్మారకం తర్వాత పెనుకేకలతో మార్మోగిన ఆసుపత్రి. ఇంకా కాల్తున్న సెగ. తననితాను పలకరించుకోలేని, తాకలేని, వోదార్చుకోలేని మంట. ఇంకా లోపలా, బయటా కాల్తున్న కమురు వాసన.

మాటలన్నీ లీలగా వినిపిస్తున్నాయ్. కలగాపులగంగా.

'ఎవరినీ ఎప్పుడూ పల్లెత్తుమాటనలేదు. పౌరుషంగా ఒక్క మాట మాట్లాడలేదు. ఎంత కష్టం వచ్చింది. స్టవ్ వెలిగిస్తుంటే షిఫాన్ కదా అంటుకుంది. మంట జరజరా పాకింది. పాపం పసిపిల్లతో అతనెంతో తల్లడిల్లిపోతున్నాడు. చాలిష్టం భార్యంటే. ఏడుస్తూనే వున్నాడు. బతుకు తుందంటారా....పసిది. తల్లిలేనిది కాదు కదా....ఏం స్టవ్వులో ఏంటో.... కట్టెలపొయ్యిలు, కుంపట్లే నయం. వూరుకోమ్మా. వూరుకో.... ప్రమాదాలు మనుష్యులకి కాక మానులకొస్తాయా. మీ రెండో అమ్మాయి వుంది కదా... పెళ్ళీడు కొచ్చిందిగా. ఊరుకోమ్మా వూరుకో....పెద్దాళ్ళు మీరే ఇలా అయిపోతే పసిదాన్తో అతను ఎంత షాక్ అయ్యాడో చూడు. బయట నుంచి ఇంట్లోకి వచ్చేసరికి భార్య మంటల్లో ....! చేరువలో పసిది. పసిదాన్ని రక్షించాడంట. భార్యనీ అతనే రక్షించాడు. పక్కవాళ్ళు వచ్చారా....పోన్లేమ్మా జరిగింది జరిగిపోయింది. లక్షకట్నం.... చిన్నదానికి పెళ్ళి అంటే మరో లక్ష కాదూ. ఎందుకొచ్చిన తగాదా....ఏదో సర్దుకు పోండయ్యా. గొడవ లెందుకు?! పసిదాని ముఖం చూడాలిగా. సొంత అక్క కూతురేగా....'

మాటలూ....మాటలూ....మాటలూ....

గాయం గాయంలాగే మిగిలిపోదు. గాయం 'పదునెక్కిన కన్నీరై తూట్లు పొడుస్తుంది. గాయం ప్రతీకారాన్ని కోరుతుంది. గాయం పగబట్టిన తాచల్లే బుసలు కొడుతుంది.

చిన్నప్పుడు నా దేహానికి మాత్రమే గాయాలయ్యాయి. పెద్దయ్యాక

నా మనసుకి మాత్రమే దెబ్బలు తగిలాయి. మరి ఇప్పుడో...నాకు దేహం లేదు. జీవితం లేదు. నేను నిప్పుపుండుని. భగ్గుమని రేగిన కిరోసిన్ మంటల్లో నా దేహం ఛిద్రమయ్యాక నేను నిప్పుపుండులానే వుంటాను.

అమ్మేదీ! నన్ను గారాబపు ముద్దులు చేసిన అమ్మేది? చిన్నప్పుడు తన వల్ల నాకు గాయమైతే బేలగా ఏడుస్తూ కూలబడిన అమ్మేదీ? అమ్మా! నువ్వూ గాయానివే. నా చల్లని గాయానివి.

ఎవరక్కడ? గ్లాజుగుడ్డల దొంతర్లని విసురుతూ, మందులూ మాకులూ నరాలకెక్కిస్తూ నర్సులు- తెల్లని గౌనులతో గాయాల్ని కప్పుకొని. డాక్టరమ్మలు తెల్లని చీరలతో గాయాల్ని దాచుకొని.

ఒరే ఎవరక్కడ! నా మీద కిరోసిన్ పోసిన రాక్షసుడి గొంతు విన్పించనివ్వకండి. వాడి గొంతు మీద నిప్పులుపొయ్యండి. ఒరే ఎవఁరా అక్కడా?

రండి! అందరూ రండి! నా మీదకు రండి. ఎంత అందంగా వున్నానో. నల్లగా మాగిపోయిన మాంసం ముద్దలా వున్నాను. తినండి. తినండి. నా గాయాల్ని ఒక్కొక్కటి కొరుక్కుతినండి. అమ్మా! అమ్మా! ఇలారా అమ్మా! నన్నోసారి అందుకో. నా పెదవుల్లేని ముఖాన్ని ముద్దాడవే. తొడుగులు వూడిన చేతుల్ని అందుకొని నన్ను ఇంటికి తీసుకపోవే?

అదిగో మళ్ళీ విన్పిస్తున్నాయి. అవే మాటలు. నా మీద అగ్గిపుల్ల గీసిన రాక్షసుడు ఇక్కడే ఎక్కడో బాహాటంగా వున్నాడు. వాడిని పట్టుకోండి. తరిమికొట్టండి. మళ్ళీ కనపడకుండా దూరంగా దూరంగా తరిమేయండి.

అడుగుల చప్పుడు.

"స్టవ్ ఎలా పేలిందమ్మా?" దయగా అడిగిన ప్రశ్న.

"నా తలపై కిరోసిన్ కుమ్మరించి అగ్గిపుల్లగీసి శరీరానికి నిప్పంటించాడు" - గొంతు విప్పాను.

నా గొంతు మేల్కొంది.